న్యాయస్థానంలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబా, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య.


పాల్గొన్న మహిళా అడ్వకేట్లు, కుటుంబసభ్యులు

ఓరుగల్లు న్యాయస్థాన ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, ఎంపీ కడియం కావ్య పాల్గొని సందడి చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ బతుకమ్మ లాంటి పర్వదినాలను జరుపుకోవటం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవటమే కాకుండా భావితరాలకు మంచి సందేశం అందించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ఇతర కార్యనిర్వాహక సభ్యులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే

జగన్మాతా.. పాహిమాం..


అన్నపూర్ణ అలంకరణలో భద్రకాళి మాత


ఎస్ఆర్ఆర్‌తోట శ్రీకనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి రూపంలో


శివనగర్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలలితాదేవి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రులు నగరంలో సందడిగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం భద్రకాళి ఆలయంతోపాటు, వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో కనిపించగా భక్తులు తరలివచ్చి తన్మయత్వంలో మునిగారు. భద్రకాళి అమ్మవారు అన్నపూర్ణ మాతగా దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో ఉదయం బ్రహ్మచారిణి, సాయంత్రం దేవజా దుర్గా క్రమంలో పూజలు చేశారు. 11 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తికి మకర వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి భద్రకాళి అమ్మవారికి పూజలు చేసి, చండీయాగంలో పాల్గొన్నారు. శివనగర్‌లో శ్రీలలితాదేవి అమ్మవారికి ధాన్యాది అభిషేక పూజలు నిర్వహించారు. ఎస్ఆర్ఆర్‌తోట శ్రీకనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో గాయత్రి అవతారంలో కనిపించారు.

న్యూస్‌టుడే, రంగంపేట, శివనగర్, కరీమాబాద్


బ్రహ్మచారి అలంకరణలో పద్మాక్షిదేవి..


నర్సంపేటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో..

మరింత పారదర్శకంగా 'ఉపాధిహామీ'


నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

నర్సంపేట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా కూలీల వేతనాలను వారి బ్యాంకు, తపాలా ఖాతాల్లో జమ చేస్తున్నారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ ఖాతాలుంటే ఆధార్ కార్డు లింకేజీతో కూలీ వేతనం ఏ ఖాతాలో జమ అయిందో తెలుసుకునేందుకు కూలీలు ఇబ్బందులు పడేవారు. దీని పరిష్కారంతో పాటు పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్ నరేగా' అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని సాయంతో కూలీలు చరవాణి ద్వారా ఉపాధిహామీ పనుల వివరాలను తెలుసుకోవచ్చు. ఆకతాయిలకు, అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ అన్ని భాషల్లో అందుబాటులో ఉంటుంది. జిల్లాలో 1.2 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 2.39 లక్షల మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో కూలీల వేతనాలు, పని దినాలకు సంబంధించిన వాటిని ఎంపిక చేసుకోవాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబ ఐడీ తదితర వివరాలు నమోదు చేయాలి. ● 'పేమెంట్ ఆప్షన్'లోకి వెళ్లి కూలీ పేరు మీద ఎంపిక చేసుకొని ఎక్కడ పని చేశారు. పని సంఖ్య, వేతనమెంత, ఎప్పుడు ఏ బ్యాంకులో జమ అయింది తదితర వివరాలను తెలుసుకోవచ్చు.

వేతనాలు జమ కాలేదా?: యాప్‌లో వేతనాలు జమ కాకపోతే సదరు కూలీ ఖాతాకు సంబంధించిన ఆధార్ లింక్ అయిందా.. ఆధార్‌తో మాదిరిగా బ్యాంకు వివరాలు ఉన్నాయా, ఏబీపీఎస్(ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టం) లింక్ అయిందా అనే వివరాలు ఉంటాయి. ఒకవేళ అన్ని ఖాతాలకు అనుసంధానమైతే పచ్చ రంగులో రైటు గుర్తు ఉంటుంది. లేకపోతే దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు ఉంటుంది. దీంతో కూలీలే నేరుగా వేతనాల వివరాలు చూసుకోవచ్చు. * జాబ్ కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తాయి. అందులో హాజరు ఆప్షన్‌ను ఎంపిక చేసుకోగానే ఈ ఆర్థిక సంవత్సరంలో ఎవరెవరు ఎన్ని రోజులు పనులు చేశారనే వివరాలు కనిపిస్తాయి.

కూలీలకు అవగాహన కల్పించాం: - ఫాతిమా, ఈజీఎస్ పీవో నర్సంపేట

గతంలో మాదిరిగా కూలీలు వేతనాల గురించి తెలుసుకునేందుకు ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. చరవాణిలో 'జన్‌మన్ నరేగా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం, కావాల్సిన వివరాలను ఎలా తెలుసుకోవాలన్న దారిపై కూలీలకు అవగాహన కల్పించాం. స్మార్ట్ ఫోన్‌లు లేని వారు క్షేత్ర సహాయకుడిని, లేదా మమ్మల్ని కలిస్తే వివరాలు చెబుతాం.

రైతు ధర్నా విజయవంతం..

భారాస శ్రేణుల్లో ఉత్తేజం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు


సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్సంపేటలో నటి అనసూయ సందడి

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్' 14వ స్టోర్‌ను శుక్రవారం జబర్దస్త్ ఫేమ్, నటి అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. ముందుగా రిబ్బన్ కత్తిరించి మాల్‌లోకి అడుగుపెట్టిన అనసూయ జ్యోతి వెలిగించారు. అనసూయను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాల్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి అనసూయ అభిమానులకు అభివాదం చేశారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కాసం షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న నటి అనసూయ

డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం వద్ద డీఎస్సీ అభ్యర్థులు శుక్రవారం ఆందోళన చేశారు. వరంగల్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన హనుమకొండ డైట్ కళాశాలలో జరుగుతోంది. విద్యాశాఖ అధికారులు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున పిలిచారు. ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు ధ్రువపత్రాల పరిశీలన చేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులకు సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్హతల మార్కుల శాతం కూడా తెలియకపోవడంతో శుక్రవారం కేంద్రం వద్ద అభ్యర్థులు ఆందోళన చేశారు. పరిశీలనలో నిబంధనలు విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి డీఎస్సీలో ఉత్తీర్ణత సాధిస్తే... సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొలువు పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నర్సంపేట, న్యూస్‌టుడే: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. స్థానిక ఐఎంఏ భవనంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, ఐఎంఏ అధ్యక్షుడు జయుడు, కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

బల్దియా ఆరోగ్యాధికారిగా డాక్టర్ రాజారెడ్డి!


డాక్టర్ బి.రాజారెడ్డి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాత సారొచ్చారు.. గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం ముఖ్య ఆరోగ్యాధికారి(సీఎంహెచ్‌వో)గా బి.రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఐదారేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయన్ను విధుల్లోకి తీసుకున్నారని తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి, పాలకవర్గం పెద్దల ఆశీస్సులతో వచ్చారని ప్రచారం జరుగుతోంది. గతంలో బదిలీపై వెళ్లిన ఆరోగ్యాధికారులెవరూ తిరిగి బల్దియాకు వచ్చేందుకు సాహసించలేదు. డాక్టర్ రాజారెడ్డి కావాలనే మళ్లీ సీఎంహెచ్‌గా ఇక్కడికి వచ్చారని తెలిసింది. 2021లో 452 మంది తాత్కాలిక కార్మికుల నియామకాల్లో చక్రం తిప్పారనే ఆపవాదు ఉంది. త్వరలో 250 మంది తాత్కాలిక కార్మికుల నియామకాలు జరుగనున్నాయి. మళ్లీ ఏం జరుగుతుందోనని చర్చించుకుంటున్నారు. శుక్రవారం బల్దియా ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు రాజారెడ్డిని కలిసి అభినందించారు.

పారిశుద్ధ్యం మెరుగయ్యేనా?

గత కొన్ని నెలలుగా నగరంలోని 66 డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. ఏడాదిన్నర నుంచి సీఎంహెచ్‌గా డాక్టర్ రాజేష్ ఉన్నారు. క్షేత్రస్థాయిలో తిరగడం లేదనే విమర్శలు వచ్చాయి. కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల నిర్వాకంతో పారిశుద్ధ్యం పనులు గాడి తప్పాయి. చాలా డివిజన్లలో అనధికార జవాన్లు కొనసాగుతున్నారు. 450-500 మంది కార్మికులు పనిచేయకుండానే జీతాలు పొందుతున్నారని తెలిసింది. కొత్తగా విధుల్లో చేరిన డాక్టర్ రాజారెడ్డికి ఇలాంటి పెనుసవాళ్లు పొంచి ఉన్నాయి.


రోజూ నీటి సరఫరా చేయాలి


నీటి పరీక్షలు పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పండగల సమయంలో తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు, ప్రతి రోజూ తాగునీరు ఇవ్వాల్సిందేనని మేయర్ గుండు సుధారాణి ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మసాగర్ చెరువు నుంచి వస్తున్న రా వాటర్‌ను ఎలా శుద్ధిపరుస్తున్నారు? ఆలం, క్లోరినేషన్ మిక్సింగ్‌లు ఎలా చేస్తున్నారు? తదితర అంశాలను ఇంజినీర్లను మేయర్ సుధారాణి అడిగి తెలుసుకున్నారు. క్లియర్ వాటర్‌లో క్లోరినేషన్ ఎంత శాతం ఉందనేది పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి తదితరులున్నారు.

దళారులు దండుకుంటున్నారు..!

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాధారణ ప్రజల ఆశను ఆసరాగా తీసుకుని రకరకాలుగా దళారులు మోసం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించకపోయినా కొన్ని పథకాల పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. గత నెల దళితబంధు పథకం రెండో విడత కింద అప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి రూ.3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రచారం చేసి వేలాది మంది నుంచి డబ్బు దండుకున్నారు. నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ ఇప్పటివరకు దళితబంధు పథకానికి సంబంధించి సుమారు వెయ్యి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. తాజాగా అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో రాయితీ రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి అర్జీలు వస్తున్నాయి. మండలాల పరిధిలో కొందరు దళారులు తమకు అధికారులు తెలుసని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రారంభించిందని. . ప్రజలను మభ్య పెడుతున్నారు. పథకం మంజూరు చేయిస్తామని ప్రజలను నమ్మించి.. వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయితీ రుణాలు, ప్రభుత్వ పథకాలు మంజూరు పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలపై అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముంది.


అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చిన దరఖాస్తు


దళారులను నమ్మి మోసపోవద్దు
-సురేశ్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టే పథకాలకు సంబంధించి మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తుంది. దళితబంధు, అంబేడ్కర్ అభయహస్తం వంటి పథకాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. అసత్య ప్రచారాలపై దళారులను నమ్మి మోసపోకూడదు. పథకాలకు సంబంధించి ప్రభుత్వం ప్రకటన చేసిన తర్వాతే.. నిబంధనలకు అనుగుణంగా.. అధికారికంగా ముద్రించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తాం.

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



డిపోల వారీగా ● మహిళా కండక్టర్లు, ● సిబ్బంది

డిపో	మహిళా కండక్టర్లు	సిబ్బంది
వరంగల్ 1	48	04
వరంగల్ 2	71	04
హనుమకొండ	112	04
జనగామ	55	01
నర్సంపేట	57	03
మహబూబాబాద్	28	02
పరకాల	37	04
భూపాలపల్లి	27	–
తొర్రూరు	43	05
ఆర్.ఎం కార్యాలయం	01	05

ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అధికారులు సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మీ, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవానీ, తొర్రూరులో రజిత, ఎంఫ్‌లు వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్ఎం కార్యాలయంలో మహితలు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.
- ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఇద్దరు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక పురుషుడితో పాటు ఒక మహిళ సభ్యులుగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.
- రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.



వరంగల్ 1 డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

- రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
- రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
- పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
- సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్స్‌లు అందించాలి.
- స్పెషల్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో ..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ 1

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్టీఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.



త్రివేణి సంగమం

● మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రాబోతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోనది సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున అటు దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..



అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

- గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణాలు ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుంటే విస్తరణ పనులు సకాలంలో పూర్తయి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడదు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.
- ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.
- మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.
- ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆధునికీకరిస్తామని పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.

విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందకు పరిమితం కాగా అయిదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు, రేపు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హనుమకొండ బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

- పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణణ, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే



హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్కలంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గొడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరువాడ కలిసేలా..



'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..

● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


వరంగల్ ఎల్బీనగర్‌లో..


నర్సంపేట పోచమ్మగుడిలో..


వరంగల్ పెరుకవాడలో..


వరంగల్ జేపీఎన్ రోడ్‌లో..


వరంగల్ కాశీబుగ్గలో..


వరంగల్ చార్‌బౌలిలో..


వరంగల్ గిర్మాజీపేటలో..


కరీమాబాద్ 39వ డివిజన్ శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం(బొమ్మలగుడి)లో


చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెంలో..

తల్లీ ఆశీర్వదించు..!

నగరంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అనేక కాలనీల్లో అందమైన మండపాలను నిర్మించి వాటిలో వివిధ రూపాల్లో ఉన్న దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాత్రి వేళ విద్యుత్తు కాంతుల వెలుగులతో మండపాలు ధగధగలాడుతున్నాయి. భద్రకాళి అమ్మవారిని నవరాత్రి ఉత్సవాల్లో వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


దుగ్గొండి మండలం నాచినపల్లిలో..


గీసుకొండ మండలం మచ్చాపురంలో..


ఖానాపురంలో..

మేమున్నాం.. మీకు తోడుగా

వరంగల్: 99635 59929, హనుమకొండ: 98484 09191, జనగామ: 99896 42307, మహబూబాబాద్: 97053 46535 (10 AM TO 1 PM)

శివనగర్, న్యూస్‌టుడే: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ పాఠశాల ముందు చెత్త వేస్తున్నారు. దుర్గంధం వస్తోంది. వర్షాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి. - సుభాన్, స్థానికుడు

- సమాధానం: రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాను. - భాస్కర్ శానిటరీ సూపర్‌వైజర్

పూలను తొలగించారు

స్పందనకు వందనం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: శంభునిపేట విశ్వనాథకాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో పేరుకుపోయిన బతుకమ్మ పూలను తొలగించారు. బతుకమ్మ పండగ రోజు మహిళలు వదిలిన పూలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయంటూ స్థానికుల వినతి మేరకు స్పందించిన కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ 41వ డివిజన్ జవాను సహాయంతో పారిశుద్ధ్య కార్మికులతో తీసేయించారు.

ఫైనల్స్‌కు మహబూబ్‌నగర్, కరీంనగర్ క్రికెట్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో శుక్రవారం జరిగిన సెమీస్‌లో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 60 పరుగులతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ (110, 136 బంతుల్లో 114, 26) అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. సాహిల్ 45 పరుగులు చేశాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన కరీంనగర్, నల్గొండ సెమీస్ మ్యాచ్‌ను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం హెచ్‌సీఏ సీఈఓ రద్దు చేశారు. నల్గొండ క్రికెట్ సంఘంలో రెండు వర్గాలకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. ఆ వివాదానికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం వెలువడటంతో నల్గొండ జట్టు ఆడిన మ్యాచ్‌ను రద్దు చేసి ప్రత్యర్థి జట్టు కరీంనగర్‌ను విజేతగా ప్రకటించినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మొగిలిచర్ల మైదానంలో ఫైనల్స్ మ్యాచ్ ఉంటుందని చాగంటి శ్రీనివాస్ తెలిపారు.


సెంచరీతో రాణించిన అబ్దుల్ (మహబూబ్‌నగర్ జిల్లా)

ముగిసిన స్పోర్ట్స్ మీట్

మామునూరు, న్యూస్‌టుడే: మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో స్టైపెండరీ కాడెట్ ట్రైనింగ్ పోలీస్ కానిస్టేబుల్స్ (ఎస్సీటీపీసీఎస్) స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024 వేడుకలు శుక్రవారం ముగిశాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, క్రికెట్ విభాగాల్లో శిక్షణార్థులకు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కమాండెంట్ రాంప్రకాష్ బహుమతులను ప్రదానం చేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఒత్తిడిని అధిగమించడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, వీరన్న, భిక్షపతి, ఆర్ఐలు శోభన్, రవి, పురుషోత్తంరెడ్డి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్ విజేతగా నిలిచిన టీంకు ట్రోఫీని అందజేస్తున్న కమాండెంట్ రాంప్రకాష్

ఎగ్‌కార్ట్ బండ్ల పంపిణీ

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన పలువురికి నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సహకారంతో మండల కేంద్రానికి చెందిన పలువురికి శుక్రవారం ఎగ్ కార్ట్ బండ్లను పంపిణీ చేశారు. భారాస నేత గోనె సంపత్ ఆధ్వర్యంలో పర్వతగిరి గ్రామానికి చెందిన కూరపాటి తులసమ్మ, చిరుకొండ నర్సయ్య, నేదునూరి విజయలక్ష్మి, పెండ్యాల నవీన్‌లకు అందజేశారు. మాజీ ఉప సర్పంచి భిక్షపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీళ్లను తోడేశారు!

ఈనాడు కథనానికి స్పందన

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్ రాతికోట ఉత్తర ద్వారంలో నిలిచిన నీటిని తోడేశారు. గత నెల 30న 'ఈనాడు' ప్రధాన సంచికలో రాతికోట.. నిర్లక్ష్యపు బాట శీర్షికతో కథనం ప్రచురితమైంది. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు స్పందించారు. మోటార్లు పెట్టి పైపుల దారా నిల్వ ఉన్న నీటిని తాత్కాలికంగా తొలగించారు.



కళాకారులను ఆదరించాలి

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం జానపద ద్వితీయ మహోత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు కళాకారులు ర్యాలీ నిర్వహించారు. పలు కళారూపాలను ప్రదర్శించారు.

అవగాహన సదస్సు

మామునూరు,న్యూస్‌టుడే: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పశువైద్య శాస్త్రవేత్త డా.జె.సాయికిరణ్ పాల్గొని రైతులకు సూచనలు చేశారు.

గన్నీ సంచుల్లో పత్తిని కొనుగోలుచేయాలి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గన్నీ సంచుల్లో తీసుకొచ్చిన పత్తినీ సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా పాలనాధికారి డా.సత్యశారదకు, మార్కెటింగ్ అధికారి సురేఖకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయరూ..

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరంగల్ పద్మానగర్ చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో దసరా ఉత్సవాలు-రావణాసుర వధ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దసరా ఉత్సవ సమితి బాధ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా పాలనాధికారి డా. సత్యశారదకు వినతిపత్రం అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ



రాయపర్తి, న్యూస్‌టుడే: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తండ్రి కేవ్లా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ మంత్రులు హరీశ్ రావు, దయాకర్ రావు, సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూధనాచారి మండలంలోని బాలాజీనగర్(టీ) తండాలో శుక్రవారం శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ కవిత, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, నాగజ్యోతి, రాకేష్‌రెడ్డి ఉన్నారు.

ఆలయాల పాలకవర్గాల ప్రమాణ స్వీకారం

నెక్కొండ, న్యూస్‌టుడే: నెక్కొండలోని రామాలయం, శివపంచాయతన సహిత అభయాంజనేయస్వామి ఆలయాల పాలకవర్గాల సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రామాలయం ఛైర్మన్‌గా కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, ధర్మకర్తలుగా ప్రభాకర్, హైమావతి, గణేష్, అనిల్, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు బీవీఎన్ శాస్త్రి ప్రమాణం స్వీకారం చేశారు. అభయాంజనేయ ఆలయ ఛైర్మన్‌గా బెజ్జంకి వెంకటేశ్వర్లు, ధర్మకర్తలుగా సత్తిరెడ్డి, వీరస్వామి, శ్రీనివాస్, యాకలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు భవిశాస్త్రీ ప్రమాణ స్వీకారం చేశారు. ఎండోమెంట్ అధికారి సమత వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అశోక్, హరిప్రసాద్, చెన్నకేశవులు, సుబ్బారెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


అభయాంజనేయస్వామి ఆలయంలో..

సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్

కొత్తవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డిజిటల్ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ డా.సత్యశారద తెలిపారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 12వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో డిజిటల్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడారు. డిజిటల్ ఫ్యామిలీ కార్డుల పైలట్ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. 12వ డివిజన్‌లో నాలుగు బృందాలు సర్వే చేపడుతుండగా, పైలట్‌వార్డులో 280 కుటుంబాలకు గాను 120 కుటుంబాలకు చెందిన సర్వే పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఆర్‌ఓ యూసుఫ్, షాజదిబేగం, ఆర్ఐలు పాల్గొన్నారు.


సర్వే పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సమగ్ర సమాచారంతో కూడిన డిజిటల్ కార్డు అందించడానికి పాటుపడుతుందని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. వర్ధన్నపేట పట్టణం పదో వార్డులో జిల్లా కలెక్టర్, దివిటిపల్లి గ్రామంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణిలు డిజిటల్ ఆరోగ్య కార్డు సర్వేను శుక్రవారం పరిశీలించారు. ప్రతి డివిజన్‌లో రెండు వందల కుటుంబాలను ఎంపిక చేసి పూర్తి వివరాలను సేకరించాలని తెలిపారు. అనంతరం పట్టణ శివారులోని వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంపీడీవో వెంకటరమణ, డీపీవో శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్ పాఠశాలలకు సహకారం

రామన్నపేట, న్యూస్‌టుడే: విద్యా బోధనలో విశేషమైన కృషి చేస్తున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలల అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సరస్వతి శిశు మందిర్ పాఠశాలల నిర్వాహకులు కరీంనగర్‌లో మంత్రిని కలిసి సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. త్వరలోనే శిశు మందిర్ పాఠశాలలు సందర్శించి, అభివృద్ధికి తగిన సహాయం చేస్తామని మంత్రి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సరస్వతి శిశు మందిర్ విద్యా పీఠం పాలక మండలి సభ్యులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కరుణాకర్‌రావు, కోల అన్నారెడ్డి, గంగాధర్, రాజేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సారయ్యతో దసరా ఉత్సవ కమిటీ భేటీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు సహకరించాలని శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్యను కోరారు. దసరా పండగ వేళ రావణ వధ కోసం ఏర్పాట్లు, ఇతర అంశాలపై చర్చించేందుకు శుక్రవారం ఎమ్మెల్సీ సారయ్యతో ఉత్సవ సమితి సభ్యులు భేటీ అయ్యారు. సారయ్యను సత్కరించారు. సారయ్యను కలిసిన వారిలో కార్పొరేటర్ గుండేటి నరేందర్, మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దూపం సంపత్, సముద్రాల పరమేశ్వర్, గుల్లపెల్లి రాజ్‌కుమార్, గోరంట్ల మనోహర్, గోరంట్ల రాజు, ధామస్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిషేధిత గుట్కా కేంద్రాలపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... మట్టెవాడ ఠాణా పరిధిలోని రాజ్‌పురోహిత్ హీరాలాల్‌కు చెందిన ప్రకాశ్ జనరల్ స్టోర్, రాజ్‌పురోహిత్ ఉత్తమ్‌కు చెందిన ఉత్తమ్ కిరాణం దుకాణంలో, హనుమకొండ ఠాణా పరిధిలో టైలర్‌స్ట్రీట్‌లోని సురేష్‌కుమార్ దుకాణంలో, పరకాల ఎర్రం రవీందర్‌కు చెందిన గోదాం, పరకాల బోడ్రాయి రోడ్డులోని పి. సత్యనారాయణకు చెందిన కావ్య కిరాణంలో తనిఖీ చేశారు. మొత్తం రూ.6.29 లక్షల గుట్కా, రూ.12.39లక్షల విలువ చేసే దీపావళి టపాసుల తయారీకి వాడే మందును స్వాధీనం చేసుకున్నారు.

జేడీఎం కార్యాలయం సకాలంలో నిర్మిస్తే మేలు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ లక్ష్మీపురంలో రూ.4.18 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలని ఆ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్ గుత్తేదారును ఆదేశించారు. శుక్రవారం జరిగిన నూతన భవనానికి దర్వాజ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీడీఎం పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, డీఈ ఎల్లేశ్, ఉద్యోగుల సంఘం నాయకులు అశోక్, జన్ను భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి..


ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నర్సంపేటలో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీలో స్థానికులకే ప్రాధాన్యమివ్వాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ముందు శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. బాలరాజు, రాజేందర్, పూలక్క పాల్గొన్నారు.

ఒకరిని కాపాడిన పోలీసులు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒకరిని మిల్స్‌కాలనీ పోలీసులు కాపాడారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీకి చెందిన రవి వృత్తిరీత్యా రోహిణి ఆస్పత్రిలో సెక్యూరిటీ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నారు. కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది హంటర్‌రోడ్డులోని ఆర్వోబీ కింది భాగంలో పట్టాలపై నడుస్తుండగా గమనించిన ఇతర వ్యక్తులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. స్పందించిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ చిరంజీవిరెడ్డి వెంటనే అక్కడికి చేరుకొని రవిని కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కానిస్టేబుల్‌ను అధికారులు ప్రశంసించారు.

రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్ రెండు, మూడు ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుట్టకోట బజార్‌కు చెందిన గొడుగు నవీన్ (21), ఖమ్మం జిల్లా ఏకునూరు మండలం రాజులపాలెం తండాకు చెందిన గుగులోతు నరేశ్ (25) అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించి.. తనిఖీ చేయగా రూ.3.50లక్షల విలువైన ఓ బంగారు గొలుసు, రెండు గాజులు, ఓ వెండి గ్లాసు, రెండు కుంకుమ భరిణలు లభించాయి. గత నెలలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఆభరణాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ పి.సురేందర్

పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. హనుమకొండలోని డైట్ కళాశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అర్హత సాధించిన ప్రతి అభ్యర్థికి చరవాణి ద్వారా సమాచారం అందించి, ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిలా అదనపు కలెక్టరు సంధ్యారాణి, డీఈవో ఎం.జ్ఞానేశ్వర్, ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం (డీసీఈబీ) కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలలు నిబంధనలు పాటించాలి

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) సుమన్‌శ్రీధర్ అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని పలు ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులను, సదుపాయాలను పరిశీలించారు. అధ్యాపకుల వివరాలు, బోధనా నైపుణ్యాలను తెలుసుకున్నారు. తరగతులతో పాటు ప్రయోగశాలలను నిర్వహించాలని ఆదేశించారు. ఆంగ్లంలో ప్రాక్టికల్స్‌ను విధిగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైస్‌మిల్లర్లు నష్టపోకుండా చూడాలని వినతి

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సందర్భంగా రైస్‌మిల్లర్లు నష్టపోకుండా చూడాలని మిల్లర్ల సంఘం ప్రతినిధులు కోరారు. శుక్రవారం నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రాలు అందించారు. వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. ప్రభుత్వ రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం చలపర్తికి చెందిన మొలంగూరి రాజు (27) హనుమకొండలో నివసిస్తూ.. సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ.. జీవితంపై విరక్తి చెందిన అతడు గురువారం రాత్రి 11 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో పురుగుల మందు తాగాడు. గమనించిన రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్ ద్వారా అతడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ..శుక్రవారం ఉదయం మృతిచెందాడు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని అతడి బాబాయికి అప్పగించారు.


రాజు (పాతచిత్రం)

సట్టా నిర్వాహకురాలి అరెస్టు

రంగశాయిపేట: లేబర్‌కాలనీలో సట్టా నిర్వహిస్తున్న గడ్డల శ్రీలతను శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. అమె వద్ద రూ.7,080 నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

చెన్నారావుపేట,న్యూస్‌టుడే: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చెన్నారావుపేట మండలం గొల్లపల్లికి చెందిన గొస్కుల ప్రభాకర్ తన ట్రాక్టర్‌పై నర్సంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. ప్రభాకర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

గుడుంబా పట్టి వేత

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: గుడుంబా విక్రయిస్తున్న జాటోతు భద్రుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు. 10 లీటర్ల గుడుంబా, 80 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నర్సంపేట నియోజకవర్గం

కంకర వేసుకున్నాం.. చదును చేయండి

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట పదోవార్డులోని ప్రతాపరుద్రనగర్ కాలనీలో గతంలో మట్టి రోడ్డు ఉండేది. వర్షం కురిసినప్పుడు బురదమయంగా మారడంతో కాలనీవాసులు జారి పడుతున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఆగస్టులో కాలనీవాసులు రూ.80 వేల విరాళాలు సేకరించి మట్టి రహదారిపై కంకర వేసుకున్నారు. డబ్బులు చాలక పోవడంతో రోలర్‌తో చదును చేయించలేదు. కంకర రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పుర అధికారులు స్పందించి రోలర్‌తో చదును చేయించాలని కోరుతున్నారు.


రహదారిపై వేసిన కంకర

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఐకాస మహిళా కన్వీనర్ జి.అరుణ అన్నారు. నర్సంపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 6ననర్సంపేటలో జరగనున్న సదస్సులో ఎమ్మెల్సీ కోదండరాం పాల్గొంటారన్నారు. సదస్సుకు విజయవంతం చేయాలని కోరారు. నర్సంపేటలో జరిగిన మరో సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు వాసునాయక్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐకాస కన్వీనర్ అరుణ

ప్రజాస్వామిక పాలనకు ఉద్యమిద్దాం

నర్సంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలనకోసం ఉద్యమించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఆబీమోని నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామిలు అన్నారు. నర్సంపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సంఘం ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అంబన్న, అనిల్, లక్ష్మయ్య, ఎస్.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, జేతురాంనాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వన్యప్రాణులు మానవ నేస్తాలే

ఖానాపురం: వన్యప్రాణులు, వనాలు మానవ నేస్తాలేనని, వాటిని కాపాడుకుందామని అటవీ రేంజి అధికారి రవికిరణ్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాకాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావి తరాలకు ప్రకృతి సంపదను బహుమతిగా ఇవ్వాలన్నారు.


ప్రదర్శన చేస్తున్న అధికారులు, విద్యార్థులు

అధికారుల సూచనలు పాటించాలి

నెక్కొండ, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. ఆమె శుక్రవారం ముదిగొండలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.